నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
I హైదరాబాద్, ఆదివారం 19 జనవరి 2025 SANGAREDDY

పాత పంటలను కాపాడుకోవాలి

– డీడీఎస్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దివ్య వెలుగురి

జహీరాబాద్, జనవరి 18: ప్రకృతిని కాపాడుతూ, పోషకాహార విలువలను అందించే చిరుధాన్యాల పాత పంటలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని జహీరాబాద్ పట్టణ సమీపంలోని పస్తాపూర్ డీడీఎస్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దివ్య వెలుగురి అన్నారు. శనివారం న్యాల్‌కల్ మండలంలోని రేజింతల్ గ్రామంలో డీడీఎస్ ఆధ్వర్యంలో 25వ పాత పంటల జాతర నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, నాయకులు, డీడీఎస్ మహిళా సంఘాల సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పాత పంటలైన తైదలు, కొర్రలు, సామలు, సజ్జ, జొన్న, పెసర, మినుము తదితర పంటల్లో అనేక పోషక పదార్థాలు ఉన్నాయన్నారు. అనంతరం గ్రామంలో డీడీఎస్

ఊరేగింపులో పాల్గొన్న నాయకులు, డీడీఎస్ మహిళలు

మహిళా సంఘాల సభ్యులు, మహిళలు కోలాటం, చిటికెల రామాయణం, ఆటపాటలతో పాతపంటల విత్తనాలతో కూడిన ఎడ్లబండ్లతో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త స్నేహలత, పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీడీఎస్ జాతర కోఆర్డినేటర్లు వినయ్‌కుమార్, మంజుల, సూపర్‌వైజర్, విజయలక్ష్మి, డీడీఎస్ మహిళా సంఘాల సభ్యులు కమలమ్మ, నర్సమ్మ, చుక్కమ్మ, నర్సమ్మ, చంద్రశేఖర్, బాలయ్య, రైతులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు సాగునీటి విడుదల

ఫలించిన ఎమ్మెల్యే హరీశ్‌రావు కృషి

రంగనాయకసాగర్ వద్ద కేసీఆర్, హరీశ్‌రావు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

- మల్లన్నసాగర్, రంగనాయక సాగర్‌ల నుంచి నీటిని విడుదల చేసిన మంత్రి కొండా సురేఖ
- పాల్గొన్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

సిద్దిపేట, జనవరి 18(నమస్తే తెలంగాణ ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు మల్లన్నసాగర్, రంగనాయక సాగర్‌ల నుంచి నీటిని విడుదల చేసింది. దీంతో చెరువులకు కాళేశ్వర జలాలు చేరనున్నాయి. ఫలితంగా యాసంగికి సాగునీరు అందనున్నది. జిల్లా రైతాంగానికి సాగునీరు విడుదల చేయాలని రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు డిసెంబర్ 4న లేఖ రాశారు. లేఖ రాయడంతో పాటు ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులతో మాట్లాడి నీటి విడుదలకు చొరవ చూపారు. యాసంగికి సాగునీరు ఇవ్వకపోతే రైతులకు ఇబ్బందులు ఎదురవుతాయని ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి సాగు నీటి కాల్వల వెంట తిరుగుతూ రైతులకు సాగునీరు విడుదల చేయాలని అనేక సార్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, రైతులు నీటి విడుదల చేయాలని ఆందోళనలు చేశారు. దీంతో ప్రభుత్వం స్పందించి రైతులకు సాగునీటిని విడుదల చేసింది. శనివారం రాష్ట్ర దేవాదాయ, అటవీ శాఖల మంత్రి కొండాసురేఖ మల్లన్నసాగర్ నుంచి దుబ్బాక కెనాల్‌కు, రంగనాయక సాగర్ నుండి నీటిని విడుదల చేశారు. కాళేశ్వర జలాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నీటి విడుదల కార్యక్రమంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. కాళేశ్వర జాలలు విడుదల చేయడంతో జిల్లా రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ హయాంలో యాసంగి దున్నకాల సమయంలోనే నీటిని విడుదల చేసి రైతులకు సాగునీటి కష్టాలు రాకుండా చూసింది. దీంతో గుంట జాగ ఎండిపోకుండా రైతులు పంటలు పండించుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రైతులు, ప్రజాప్రతినిధులు ఆందోళన చేయడం, డిమాండ్ చేస్తే తప్పితే నీటిని విడుదల చేయాలనే సోయి లేకుండా పోయింది.

కేసీఆర్ పాలనలో జిల్లా సస్యశ్యామలం..

సమైఖ్య రాష్ట్రంలో అప్పటి ప్రభుత్వాలు ఉమ్మడి మెదక్ జిల్లాలో ఒక్క ప్రాజెక్టు నిర్మాణం చేపట్టలేదు. తెలంగాణ రాష్ట్రం వచ్చాక కేసీఆర్ నాయకత్వంలో ఉమ్మడి మెదక్ జిల్లాలో కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా అన్నపూర్ణ, రంగనాయక, మల్లన్నసాగర్, కొండపోచమ్మ రిజర్వాయర్లను రికార్డు సమయంలో నిర్మించారు. వీటి నుంచి కాలువల ద్వారా రైతులకు యాసంగి పంటలకు సాగునీటిని విజయవంతంగా విడుదల చేసింది. దీంతో మండుటెండల్లో సైతం చెరువులు, చెక్ డ్యామ్‌లు, వాగులు, వంకలు జలంతో కనిపించాయి. కూడవెల్లి, హల్దీవాగులకు గోదావరి జలాల ద్వారా జీవం పోసింది. ఫలితంగా భూమికి బరువయ్యేలా కొన్నేండ్ల నుంచి పంటలు పండాయి. గుంట జాగ లేకుండా రైతులు అచ్చుకట్టి పంటలు సాగు చేశారు. ఫలితంగా రైతులకు చేతినిండా పని దొరికింది. పక్క రాష్ట్రాల నుంచి వచ్చిన కూలీలకు ఉపాధి దొరికింది. ఉమ్మడి జిల్లాలో లక్ష లాది ఎకరాలు సాగులోకి వచ్చాయి. రైతు బంధును సకాలంలో ఎకరానికి రూ. 5 వేల చొప్పున అందించడమే కాకుండా నాణ్యమైన 24గంటల కరెంట్‌ను అందించి వ్యవసాయాన్ని కేసీఆర్ పండుగ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక తీసుకుంటున్న చర్యలతో రైతులు ఆందోళనలో ఉన్నారు. ఇప్పటి వరకు రైతుబంధు రాలేదు. రైతులు అప్పులు తెచ్చి యాసంగి సాగు చేస్తున్నారు. నీళ్లు వస్తాయే లేదో ..కరెంట్ పరిస్థితి ఎంటో అని దిగులు చెందుతున్నారు. సగానికి పైగా భూములు సాగుచేయడం లేదు. మరికొంతమంది రైతులు నీటి కష్టాలు తప్పవని తెలిసి ఆరుతడి పంటలను సాగుచేశారు. వరి నాటు దశలోనే కరెంట్ కష్టాలు వేధిస్తున్నాయి. జిల్లాలో అనధికార కరెంట్ కోతలను విధిస్తున్నారు. రాత్రి వేళ కరెంట్ కట్ అవుతున్నది. రోజంతా ఇచ్చే కరెంట్‌లో కూడా కోతలు షురూ అయ్యాయి. మాటిమాటికి కరెంట్ ట్రిప్ అవుతున్నట్లు రైతులు చెబుతున్నారు. ఫలితంగా సాగు చేసిన పంటలు కూడా చేతికి వస్తాయా..? లేదా అనే ఆందోళనలో రైతులు ఉన్నారు. కాంగ్రెస్ పాలనలో తమకు చేయూత కరువైందని రైతులోకం ఆవేదన వ్యక్తం చేస్తున్నది.

బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- మద్దూరులో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం



మద్దూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



చేర్యాల: సీసీ రోడ్డు పనుల ప్రారంభం సందర్భంగా కొబ్బరికాయతో మొక్కుతున్న ఎమ్మెల్యే

మద్దూరు(ధూళిమిట్ట), జనవరి 18: రాబోయే పంచాయతీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం మద్దూరు మండల కేంద్రంలోని తాజ్‌మహల్ గార్డెన్‌లో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మేక సంతోష్‌కుమార్, మంద యాదగిరి అధ్యక్షతన మద్దూరు, ధూళిమిట్ట మండలాల బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆంక్షలు పెట్టి రైతు భరోసా పథకాన్ని పక్కనపెట్టేందుకు ప్రయత్నిస్తుందని ధ్వజమెత్తారు. ఈ-కార్ రేసుతో తెలంగాణ ఖ్యాతి ప్రపంచానికి తెలియజేసిన ఘనత బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కే దక్కుతుందన్నారు. కేటీఆర్‌తో పాటు కౌశిక్‌రెడ్డిపై అక్రమంగా కేసులు బనాయించడంపై మండిపడ్డారు. హామీలు అమలు చేయడం చేతకాక బీఆర్ఎస్ నాయకులపై రేవంత్ సర్కార్ అక్రమంగా కేసులు పెడుతుందన్నారు. ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదన్నారు. నీలిమా దవాఖాన ద్వారా పేదలకు ఉచితంగా వైద్యాన్ని అందిస్తున్నట్లు గుర్తుచేశారు. నియోజకవర్గ సమస్యలపై శాసనసభలో ప్రభుత్వాన్ని ఎప్పటికప్పుడు ప్రశ్నిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో మాజీ ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ సుంకరి మల్లేశంగౌడ్, మాజీ వైస్ఎంపీపీ మలిపెద్ది సుమలతామల్లేశం, పీఏసీఎస్ చైర్మన్ నాగిళ్ల తిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్ ఇర్రి రాజిరెడ్డి, మాజీ జడ్పీటీసీ నాచగోని పద్మావెంకట్‌గౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ముస్త్యాల బాల్‌నర్సయ్య, అంకుగారి శ్రీధర్‌రెడ్డి, పుర్మ వెంకట్‌రెడ్డి, పుట్ట వెంకటరమణారెడ్డి, దుబ్బుడు వేణుగోపాల్‌రెడ్డి, ముస్త్యాల నాగేశ్వర్‌రావు, సర్పంచ్‌ల ఫోరం మాజీ మండల అధ్యక్షులు వంగ భాస్కర్‌రెడ్డి, చొప్పరి వరలక్ష్మీసాగర్, బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంగిటి కమలాకర్, బీఆర్ఎస్ మహిళా మండల అధ్యక్షురాలు కర్ర అరుణ, పోగుల మమత, మాజీ సర్పంచ్‌లు, బీఆర్ఎస్ అనుబంధ సంఘాల నాయకులు, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు పాల్గొన్నారు.

హామీల అమలుపై పోరాడుతాం

– జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, జనవరి 18: ఆరు గ్యారెంటీలు, ఇచ్చిన హామీలన్నీ అమలు చేసేవరకు కాంగ్రెస్ సర్కారుపై పోరాడుతామని, రైతులతో పాటు అన్నివర్గాలను కాంగ్రెస్ సర్కారు నిండామునిచిందని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా చేర్యాల మార్కెట్ యార్డులో శనివారం కందుల కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాన్ని నిర్వాహకులు అవినీతి లేకుండా నిర్వహించాలన్నారు. ఆచరణ సాధ్యం కాని హామీలిచ్చి కాంగ్రెస్ సర్కారు రైతులను నట్టేట ముంచిందన్నారు. ఇప్పటి వరకు రైతు భరోసా ఇవ్వలేదన్నారు. రైతులకు రూ.2లక్షల వరకు రుణ మాఫీ చేస్తామని చెప్పి ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో చేయకుండా మోసం చేసిందన్నారు. కేసీఆర్ పాలనలో చినుకుల పడే సమయంలో రైతుబంధు రైతుల ఖాతాల్లో జమ చేసేవారని, కాంగ్రెస్ వచ్చాక రైతును ఆగమాగం చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను అరిగోస పెడుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు కంది పంటను అంతర్గత పంటగా సాగు చేసుకున్నారని, కానీ, వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది కంది పంటను నమోదు చేయలేదన్నారు. రైతులు తాము పండించిన కందులను విక్రయించుకోవాలంటే వ్యవసాయశాఖ అధికారులు నమోదు చేయలేదు కాబట్టి వారికి ప్రభుత్వ మద్దతు ధర దక్కదని, వెంటనే అధికారులు కంది పంటను నమోదు చేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఈ విషయమై జిల్లా వ్యవసాయశాఖ అధికారితో ఫోన్‌లో ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణిశ్రీధర్‌రెడ్డి, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, కౌన్సిలర్ మంగోలు చంటి, పీఏసీఎస్ డైరెక్టర్ జ్యోతి మహిపాల్‌రెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ పుర్మ వెంకట్‌రెడ్డి, ముస్త్యాల బాల్‌నర్సయ్య, మాజీ ఎంపీపీ వుల్లంపల్లి కరుణాకర్, మాజీ వైస్ ఎంపీపీ తాండ్ర నవీన్‌రెడ్డి, పెడుతల ఎల్లారెడ్డి, పార్టీ టౌన్, మండల అధ్యక్షులు ముస్త్యాల నాగేశ్వర్‌రావు, అనంతుల మల్లేశం, రంజిత, మానస పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం...

చేర్యాల పట్టణంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో శనివారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ సుంకరి మల్లేశంగౌడ్, యూత్ ఇన్‌చార్జి శివగారి అంజయ్య, బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గదరాజు చందు, నాయకులు మంచాల కొండయ్య, ఉట్కూరి అమర్‌గౌడ్, అరిగే కనకయ్య, కోతి దాసు, పచ్చిమడ్ల సిద్ధి రాములు, బుడిగె శ్రీనివాస్, భూమిగారి రాజేందర్, అవుశర్ల కిశోర్ పాల్గొన్నారు.

ఉద్యమకారుడికి పరామర్శ

తెలంగాణ ఉద్యమకారుడు పుర్మ దయాకర్‌రెడ్డి అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఆయన్ను ఎమ్మెల్యే పల్లా పరామర్శించారు. తన దవాఖానలో వైద్యం చేయిస్తానని, అధైర్యపడవద్దని భరోసా నిచ్చారు. ఆయన వెంట బీఆర్ఎస్ టౌన్ సెక్రటరీ బూరగోని తిరుపతిగౌడ్, కందుకూరి సిద్దిలింగం, రవీందర్‌రావు, పాక బాలయ్య తదితరులు ఉన్నారు.

విద్యుత్ షాక్ పెట్టి అన్నను చంపిన తమ్ముడు

మృతుడు శంకర్ (ఫైల్)

మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ

శివ్వంపేట, జనవరి 18: రక్త సంబంధాన్ని మర్చి సొంత అన్ననే తమ్ముడు కడతేర్చిన ఘటన మెదక్ జిల్లా శివ్వంపేట మండలం బిక్యతండా పంచాయతీ నగూతండాలో చోటుచేసుకుంది. తూప్రాన్ సీఐ రంగ కృష్ణ వివరాల ప్రకారం... నగూతండాకు చెందిన తేజావత్ చందర్‌కు శంకర్ (28), గోపాల్ (22) ఇద్దరు కుమారులు సంతానం. గోపాల్ ఈ మధ్యనే ఓ చోరీ కేసులో జైలు నుంచి విడుదలయ్యాడు. అన్నదమ్ములిద్దరికీ గతంలో గొడవలు జరిగాయి. ఈ విషయాన్ని మనసులో పెట్టుకున్న తమ్ముడు గోపాల్ ఎలాగైనా అన్న శంకర్‌ను చంపాలని నిర్ణయించుకున్నాడు. శనివారం రాత్రి అన్నదమ్ములు ఇద్దరు ఒకేరూమ్‌లో పడుకున్నారు. రాత్రి 12:30 గంటల ప్రాంతంలో నిద్రలేచిన గోపాల్ అన్న శంకర్ కాలికి, చేతికి విద్యుత్ వైర్లు కట్టి స్విచ్ బోర్డులో పెట్టడంతో షాక్‌కు గురై మృతిచెందాడు. శంకర్ అరుపులకు లేచిన తండ్రిని చూసి గోపాల్ పరారయ్యాడు. విషయం తెలుసుకున్న తూప్రాన్ సీఐ రంగ కృష్ణ పోలీసు సిబ్బందితో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి తండ్రి చందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. నిందితుడు గోపాల్‌ను 8 గంటల్లోపే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

అడ్డుకున్న చేతులే హారతులు పడుతున్నయి

కేసీఆర్ కృషితోనే ప్రాజెక్టుల నిర్మాణం

- బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన పనులకే ప్రారంభోత్సవాలు
- కాంగ్రెస్ ప్రభుత్వం కాలువలు కూడా నిర్మించడం లేదు
- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

మల్లన్నసాగర్ ప్రధాన కాలువలో పూలు చల్లుతున్న కొండా సురేఖ, కొత్త ప్రభాకర్‌రెడ్డి

తుక్కాపూర్ పంప్‌హౌస్ వద్ద మోటారు స్విచ్ ఆన్ చేసి నీటిని విడుదల చేస్తున్న మంత్రి, ఎమ్మెల్యే

తొగుట, జనవరి 18: మల్లన్నసాగర్ ప్రాజెక్టు వద్దంటూ ఆరోజు అడ్డుకున్న నేతల చేతులే నేడు గోదావరి జలాలకు హారతులు పడుతున్నాయని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా తొగుట మండలంలోని తుక్కాపూర్ పంపుహౌస్ వద్ద ప్రధాన కాలువకు శనివారం మంత్రి కొండా సురేఖతో కలిసి ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి నీటిని విడుదల చేశారు. అనంతరం కాలువలో గోదారమ్మకు పూలు చల్లి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో సీఎం కేసీఆర్ ప్రాజెక్టుల నిర్మాణానికి తలపెడితే బీజేపీ, కాంగ్రెస్ నాయకులు అడ్డుకున్నారని, అడుగడుగునా అవాంతరాలు సృష్టించారని గుర్తుచేశారు. అన్ని అడ్డంకులను అధిగమించి కేసీఆర్ ప్రాజెక్టులు నిర్మించి దుబ్బాక వంటి దుర్భిక్ష ప్రాంతానికి సాగు,తాగునీటిని అందించారని తెలిపారు. కేసీఆర్, హరీశ్‌రావుకు దుబ్బాక, సిద్దిపేట నియోజకవర్గ ప్రజలు, రైతుల రుణపడి ఉంటారని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కూలి పోయిందన్న కాంగ్రెస్ నాయకులు, ఇక్కడ విడుదల చేసిన గోదావరి జలాలు కాళేశ్వరం నుంచి వచ్చినవి కావా అని ప్రశ్నించారు. దుబ్బాక నియోజకవర్గంలో కాలువలు నిర్మించాలని ఏడాదిగా ప్రభుత్వానికి అనేక సార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల మీద ప్రేమ ఉంటే వెంటనే కాలువలు పూర్తి చేయాలని కోరారు. కూడవెల్లి వాగుతో పాటు రామాయంపేట, చిన్నశంకరంపేట కాలువలకు నీళ్లు విడుదల చేయాలన్నారు. పాత పనులకే కొత్త పూత అన్నట్లు గత ప్రభుత్వం హయాంలో నిర్మించిన పనులకే నేడు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసుకుంటున్నట్లు తెలిపారు. మల్లన్నసాగర్ కాలువ ద్వారా తొగుట దుబ్బాక, సిద్దిపేట, నంగునూరు, నారాయణరావుపేట, ముస్తాబాద్ మండలాల్లోని 80 వరకు చెరువులు, కుంటలను నింపి సాగునీరు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ,కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, నాయకులు మనోహరరావు, జీడిపల్లి రాంరెడ్డి, హరికృష్ణ రెడ్డి, బాసిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, దోమల కొమురయ్య, చిలువేరి మల్లారెడ్డి, బక్క కనకయ్య, కొమురయ్య, ఎండీ ఖలీమొద్దీన్, గోవర్ధన్‌రెడ్డి, రమేశ్, నాయకులు, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



భూంపల్లిలో హెల్త్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కొండా సురేఖ, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

భూంపల్లిలో హెల్త్‌సెంటర్ ప్రారంభం

- ప్రొటోకాల్‌పై బీఆర్ఎస్ నాయకుల ఆందోళన

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి) జనవరి 18: సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట-భూంపల్లి మండలం భూంపల్లిలో శనివారం మంత్రి కొండా సురేఖ దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పర్యటించారు. ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను వారు ప్రారంభించారు. సిద్దిపేట ఏసీపీ మధు ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు కల్పించారు. చేగుంటలో స్టేజీ పైకి దుబ్బాక కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డిని ప్రొటోకాల్ విస్మరించి కూర్చోబెట్టడంపై బీఆర్ఎస్ నాయకులు వ్యతిరేకించి నినాదాలు చేశారు. దీంతో కాంగ్రెస్ నాయకులు పోటీగా నినాదాలు చేశారు. అక్కడే ఉన్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఇరు పార్టీల నాయకులను సముదాయించారు. భూంపల్లికి చేరుకున్న మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య కలిసి ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను ప్రారంభోత్సవానికి లోపలికి వెళ్లారు. వారి వెంట బీఆర్ఎస్ నాయకులు వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో ఆగ్రహంతో బీఆర్ఎస్ నాయకులు సబ్ సెంటర్ గేటు ఎదుట బైఠాయించి కాంగ్రెస్ సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బీఆర్ఎస్ నాయకులను పోలీసులు బలవంతంగా అక్కడి నుంచి పంపించారు.

చెక్కులు అందజేత...

మిరుదొడ్డి పట్టణంలో శనివారం దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి మంత్రి కొండా సురేఖ దుబ్బాక నియోజకవర్గానికి చెందిన 316 మంది కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా తులం బంగారం ఎక్కడా అంటూ బీఆర్ఎస్ నాయకులు అడగ్గా, కాంగ్రెస్ నాయకులు నినాదాలు చేశారు. మంత్రి, ఎమ్మెల్యే ఇద్దరు కలిసి ఇరు పార్టీల నాయకులను, కార్యకర్తలను సముదాయించారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభంలో ప్రొటోకాల్ ఉల్లంఘన



చేర్యాల మార్కెట్ యార్డులో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

చేర్యాల, జనవరి 18: సిద్దిపేట జిల్లా చేర్యాల వ్యవసాయ మార్కెట్ యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో శనివారం కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవంలో హైడ్రామా చోటు చేసుకుంది. కందుల కొనుగోలు కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రారంభించాల్సి ఉంది. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి రాకముందే డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి పీఏసీఎస్ చైర్మన్ మెరుగు కృష్ణ, కొందరు డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులతో కలిసి కేంద్రం వద్ద రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి వెళ్లిపోయాడు. అధికారుల ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి పల్లా చేర్యాల మార్కెట్‌యార్డుకు వస్తున్నారని తెలుసుకున్న సంబంధిత అధికారులు హుటాహుటిన తిరిగి రిబ్బన్ ఏర్పాటు చేసి కొబ్బరికాయలు తీసుకువచ్చి కేంద్రం ఏర్పాటుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్యే వచ్చి కేంద్రాన్ని ప్రారంభించి రైతులకు మద్దతు ధర వచ్చేలా, ఎలాంటి అవినీతికి తావులేకుండా కేంద్రం నిర్వహించాలని సూచించారు. ప్రొటోకాల్ ఉల్లంఘించి కాంగ్రెస్ నాయకులు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలుసుకున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రొటోకాల్ పాటించక పోవడం సిగ్గుచేటని, ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, వారి చేతిలో కాంగ్రెస్ నాయకులకు గుణపాఠం తప్పదని పేర్కొన్నారు.

దుబ్బాకలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

- పాల్గొన్న మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి
- దుబ్బాకలో పోలీసుల అత్యుత్సాహం
- బీఆర్ఎస్ కార్యకర్తపై చేయిచేసుకున్న సీఐ
- సీఐ తీరుపై మండిపడ్డ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాకలో చిల్డ్రన్ పార్కును ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డితో కలిసి ప్రారంభిస్తున్న మంత్రి

దుబ్బాక, జనవరి 18: సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణంలో శనివారం పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల కార్యక్రమాల్లో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డితో కలిసి రాష్ట్ర మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు. దుబ్బాక పట్టణంలో టీయూఎఫ్ఐడీసీ, పట్టణ ప్రగతి నిధుల ద్వారా రూ.40 లక్షలతో నిర్మించిన చిల్డ్రన్ పార్కును, రూ.73 లక్షలతో నిర్మించిన మానవ ఘన వ్యర్థాల శుద్ధీకరణ (ఎఫ్ఎస్‌టీపీ) కేంద్రాలను ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డితో కలిసి మంత్రి ప్రారంభించారు. నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరైనట్లు మంత్రి తెలిపారు. ఇందిరమ్మ కమిటీల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసి, గ్రామసభల్లో వారికి అధికారులు ఎంపిక పత్రాలు అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నే వనితాభూంరెడ్డి, కౌన్సిలర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దుబ్బాకలో పోలీసుల అత్యుత్సాహం

దుబ్బాక పట్టణంలో పార్కు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఓ పోలీసు అధికారి అత్యుత్సాహం ప్రదర్శించాడు. ఆ పోలీసు అధికారి బహిరంగంగానే బీఆర్ఎస్ కార్యకర్తపై చేయి చేసుకున్నాడు. శనివారం మధ్యాహ్నం దుబ్బాకలో పార్కు ప్రారంభోత్సవ కార్యక్రమానికి మంత్రి, ఎమ్మెల్యేలు వేర్వేరుగా తమ వాహనాల్లో బయలుదేరారు. ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డికి పోలీసులు కాన్వాయ్ కల్పించలేదు. దీంతో ఎమ్మెల్యేకు దారి చూపించేందుకు స్థానిక బీఆర్ఎస్ కార్యకర్త పడాల నరేశ్ తన కారు ముందు నడిపిస్తూ వచ్చాడు. ఈ విషయంపై దుబ్బాక సీఐ శ్రీనివాస్ ఆవేశంతో వచ్చి నరేశ్‌పై చేయి చేసుకున్నాడు. కొంత సమయానికి విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి సీఐ శ్రీనివాస